ఈనాడు
ఎన్ఆర్ఐ

# గాంధీ మెమోరియల్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం



ఇర్వింగ్: మహాత్మా గాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సస్ ఆధ్వర్యంలో అమెరికాలోని ఇర్వింగ్ నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 300 మంది ప్రవాస భారతీయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఇర్వింగ్ నగర మేయర్ రిక్ స్టోఫర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్థ కార్యదర్శి రావు కల్వల అతిథులకు స్వాగతం పలికారు. అంతేకాకుండా యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను కార్యక్రమానికి హాజరైన వారికి వివరించారు. అందరూ ఒక చోట చేరి ఇలాంటి కార్యక్రమాలు చేసుకోవడానికి మహాత్మా గాంధీ మెమోరియల్ ప్రధాన వేదిక కావడం సంతోషంగా ఉందని సంస్థ ఉపాధ్యక్షుడు బి.ఎన్ రావు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ మెమోరియల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ.. ఎన్నో వేల సంవత్సరాల క్రితమే యోగా అనే ప్రక్రియను భారతదేశం ప్రపంచానికి పరిచయం చేసిందన్నారు. యోగా అనేది యావత్ ప్రపంచానికి భారత్ అందించిన ఒక గొప్ప కానుకగా  అభివర్ణించారు. యోగా సంవత్సరానికి ఒక సారి వచ్చే పండుగలా కాకుండా దైనందిన జీవితంలో ఒక భాగం కావాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా యోగాను ఒక పాఠ్యాంశంగా నగరంలో ఉన్న అన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టాలని ఇర్వింగ్ మేయర్‌కి సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇర్వింగ్ నగర మేయర్ రిక్

మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని.. యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన భారతదేశానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ టెక్సస్, డాలస్ విద్యార్థులకు మహాత్మా గాంధీ మెమోరియల్ సంస్థ రెండు వేల డాలర్ల ఉపకార వేతనాన్ని యూనివర్సిటీ ఆసియా సెంటర్ డైరెక్టర్ మోనిక్, ఇర్వింగ్ మేయర్ అందజేశారు. 92వ స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీల్లో విజేతలుగా నిలిచిన అభిజాయ్ కొడాలి, సోహుమ్ సుఖతన్కర్, రోహన్ రాజా, వారి తల్లిదండ్రులను గాంధీ మెమోరియల్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు గంటల పాటు యోగా గురువులు విజయ్, పెగ్గీ నేతృత్వంలో ప్రవాస భారతీయులు యోగాలోని మెళకువలను ఉత్సాహంగా నేర్చుకొని సాధన చేశారు. ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించడానికి సహాయ సహకారాలు అందించిన స్వచ్ఛంద సేవకులు, కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, ఇతర సభ్యులకు సంస్థ కోశాధికారి అభిజిత్ రాయిల్కర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



